# అమ్మో! చావు... చచ్చే చావేనే!

- మీనాక్షి శ్రీనివాస్.

'కరువులో అధిక మాసం', 'ఛస్తుంటే సంధి మంత్రం' వగైరా వగైరాలన్నీ నాలాంటి వాళ్లని చూసే కనిపెట్టబడి ఉంటాయి. కింద పెట్టి, మీద పెట్టి ఒకటో తారీఖున వచ్చే జీతాన్ని ఎడారిలో మంచినీళ్లలా ఎంతో ప్రాణప్రదంగా ఆచితూచి ఖర్చుపెడితేనే నెలాఖరు వచ్చేసరికి చేతిలో చిల్లిగవ్వ ఉండటం లేదు. అలాంటిది ఈ నెల అన్ని అవసరాలు, ఇబ్బందులూ ఇబ్బడిముబ్బడిగా వచ్చి మీదపడితే తట్టుకోగలిగినంత మొనగాడినా... ఏమిటి? ఇప్పుడెలా? ఈ అవసరాలు ఏమాత్రం మొహమాటం లేకుండా జాలీ, దయా లేకుండా వచ్చిపడితే నేమాత్రం ఏం చేస్తా... చూస్తా... చూస్తా... ఎవడో ఒకడు ఆపద్బాంధవుడిలా దొరక్కపోతాడా, చక్రం అడ్డు వెయ్యకపోతాడా!

ఏమిటీ...? మీలో మీరే మాట్లాడేసుకుంటూ ఏకపాత్రాభినయం చేస్తున్నారు. ఈ వేళ ఆఫీసుకు సెలవా ఏం...? అడిగింది సుబ్బారావు సగభాగం.

'సెలవా... నా బొందా! సాక్షాత్తూ ఆయనే పోయినా సెలవివ్వడు మా ప్రొప్రయిటర్. ఛండామార్కుడు. వఠి మూర్ఖుడు. అయినా, ఒకడినని ఏం లాభం లే. నా రాతయినా తగలబడితే...' అంటూ హడావుడిగా స్నానం పానం కానిచ్చి ఆఫీసుకు బయలుదేరాడు సుబ్బారావు.

'ఇదిగో ఇంట్లోకి కావాల్సిన సరుకులు... అన్నీ కొద్దిగానే రాశాలెండి... మళ్లీ జీతాలొచ్చాకే తెచ్చుకుందాం' అంటూ చీటీ అందించింది అర్ధాంగి లక్ష్మి.

చచ్చాం రా దేముడా! గోరుచుట్టు మీద రోకటిపోటులా ఇప్పుడిదొకటా... అసలు ఆఫీసుకెళ్లి రావడానికీ, కూరలకూ నారలకూ డబ్బులెలా వస్తాయా అని నేనాలోచిస్తుంటే మళ్లీ ఇదొకటా... మనసులోనే గింజుకుంటూ అలాగే నిలబడిపోయాడు సుబ్బారావు.

'ఏమిటీ? ఇదిగో చీటీ... అంటే ఉలకక పలకక అలా నిట్రాటలా నిలువు గుడ్లేసుకు నిలబడ్డారు' వెటకారంగా అంది లక్ష్మి.

'అదీ... అది... అయినా అప్పుడే సరకులు అయిపోయాయా... నెలకు సరిపడా తెచ్చా కదా...' మనసులో భయపడుతూనే డాంబికంగా అన్నాడు సుబ్బారావు.

'ఆс... నేను నవకాయ పిండివంటలూ చేసుకు తిన్నా కదూ... అందుకే అయిపోయాయి...' దీర్ఘం తీస్తూ అంది లక్ష్మి.

'ఏమిటా దీర్ఘాలూ, వెటకారాలూ... సరే! ఇలా తగలెయ్యి...' గయ్యిమన్నాడు సుబ్బారావు.

'పోయిన నెల హాస్పిటల్ పనిమీద మా మేనత్త కూతురి ఆడపడుచు వాళ్లు వచ్చి వెళ్లారనేగా... పంతానికి ఈ నెల మీ పెదనాయనగారి కోడలి అన్నావదినా ఏదో ఆఫీసు పనిమీద ఈ ఊరు వచ్చి ఏదో చుట్టపు చూపుగా చూసిపోదామని వస్తే... వచ్చిన వాళ్లని మొహమాటపెట్టేసి, బలవంతపెట్టి పదిరోజులపాటు ఉంచేసి, వాళ్లకి షోడసోపచారాలూ, రాజలాంఛనాలు జరిపి నాచేత గాడిద చాకిరీ చేయించారు. ఇప్పుడు నీలుక్కుని ఏం లాభం ... వెళ్లండి! వెళ్లి ఆ సరుకులు తెచ్చి నా ముఖాన తీగలెట్టండి- విసురుగా అంది లక్ష్మి.

'ఇదిగో లక్ష్మీ... అంత గోరోజనం పనికిరాదు. ఎందుకలా నోరు పారేసుకుంటావు. వాళ్లేం గతిలేక మనింటికి రాలేదు. ఏదో దూరపు బంధువు కదా చూసిపోదామని అభిమానంతో వచ్చారు' ఉక్రోషంగా అన్నాడు సుబ్బారావు.

'అవే కదా నేననేదీను... వాళ్లకేం గతిలేక పోలేదుగా... హాయిగా ఆఫీసువాళ్లు అన్ని ఎరేంజ్‌మెంట్స్ చేసేటప్పుడు మనమీద వాలిపోవడం. అయినా పాపం వాళ్లనెందుకులెండి అనిపోవడం... మీరు కాదూ తగుదునమ్మా అని వాళ్లని బలవంతంగా అట్టిపెట్టింది' కుండ




పగలుగొట్టినట్లుగా అంది లక్ష్మి.

'సరి... సరి... నీతో వాదిస్తూ వుంటే నాకవతల ఆఫీసుకు లేటయిపోతుంది. మళ్లీ మా ఆఫీసరుగాడు నామీద పడతాడు. అందరికీ తేరగా దొరికేది నేనేగా!' గుర్రుగా అన్నాడు సుబ్బారావు.

'చేసే పనులు సవ్యంగా ఏడిస్తే ఎవరికైనా మిమ్మల్నే పనేముందిలెండి' పెడసరంగా అంది లక్ష్మి.

'ఛ... ఛ... ఇల్లు రానురానూ నరకం అయిపోతోంది. అసలు నిన్నని ఏం లాభం లే... మెడకి గుదిబండలా నిన్ను కట్టబెట్టి చచ్చాడే నా బాబు ... ఆయన్ననాలి... ఎక్కడ సుఖపడిపోతానో

అన్నట్లు... 'పెళ్లో... పెళ్లో...' అంటూ నా ప్రాణాలు తోడేశాడు.

'సరేలెండి! ఉరుము ఉరిమి మంగలం మీద పడిందని... ఇటు తిరిగి, అటు తిరిగి పాపం చచ్చి స్వర్గాన వున్న ఆ పెద్దాయన నెందుకులెండి ఆడిపోసుకోవడం... అందరూ పెళ్లిళ్లు చేసుకోవడం లేదా! సంసారాలు నడపడం లేదా! ఆడలేక మద్దెల ఓటన్నాడట మీలాంటివాడే వెనకటికెవడో!

ముందువెనుకలాలోచించి పొదుపుగా బతకడం రాక, ఉన్నవాళ్లనీ, పోయినవాళ్లనీ తిన్నదరిగేలా తిట్టడం ఒకటిపైగా... సరే! ఈ రామాయణం రోజూ ఉండేదే గానీ! వెళ్లండి! మళ్లీ ఆ బస్సుకాస్తా వెళ్లిపోతుంది.

సరేలే! వెళ్లక ఛస్తానా... ఏమిటీ?

ఛ... ఛ... వెధవ అపశకునం మాటలూ మీరూనూ...

క్షేమంగా వెళ్లి లాభంగా రండి!'

'అదొక్కటే తక్కువ... లాభమొకటి నా ముఖానికి.

సరే వెడుతున్నా... తలుపేసుకో.'

ఆ రోజంతా ఆలోచిస్తూనే ఉన్నాడు సుబ్బారావు.

'నిజమే! లక్ష్మి అన్నదాంట్లో అసత్యమేమాత్రం లేదు. పాపం తను ఉన్నంతలో పొదుపుగా, జాగ్రత్తగా నడుపుకొస్తుంది. నేనే అక్కర్లేని భేషజాలకీ, అనవసరపు ఆర్భాటాలకీ పోయి ఖర్చులు పెంచేసేది. ఎలా అయినా ఇకనుంచి జాగ్రత్తగా ఉండాలి. అసలే పిల్లలు పెద్దవుతున్నారు. వాళ్ల చదువులనీ, ఇవనీ... అవనీ... ఖర్చులు పెరుగుతాయే తప్ప తరగవు కదా! అవసరాలు పెరుగుతున్నాయని ఆదాయాలు పెరగవు కదా!'

'ఏమిటీ? ఏదో దీర్ఘాలోచనలో పడిపోయావు సుబ్బారావ్!' అడిగాడు తోటి కొలీగ్ కనకారావు.

'అదీ... అది!' నసిగాడు సుబ్బారావు.

'ఏమిటీ? ఏమైనా పైకం కావాల్నా?' అడిగాడు ఆప్యాయంగా.

'అవును! ఈ నెల కొంచెం అనుకోని ఖర్చులొచ్చి...' మొహమాటంగా అడిగాడు సుబ్బారావు.

'నువ్వేమీ అనుకోకపోతే ఒక్కమాట సుబ్బారావ్! ఏదో అన్నదమ్ముల్లా కలసిపోయాం కనుక చనువుకొద్దీ చెబుతున్నా... బంధుప్రేమ ఉండటం మంచిదే కానీ, ఈ కరువు రోజుల్లో మనం ఎవరినీ ఇబ్బంది పెట్టకూడదు. అలానే- మనల్నీ ఎవరూ ఇబ్బంది పెట్టకుండా చూసుకోవాలోయ్! మరీ అంత మొహమాటం పనికిరాదు. నీ పిల్లలూ ఎదుగుతున్నారు. పాపం వాళ్ల కోసం ఏనాడైనా ఖర్చుపెట్టగలిగావా? అంతెందుకు... పాపం మా సిస్టరుకి ఏదైనా ఓ చిన్న నగో, ఖరీదైన చీరో కొనగలిగావా ఇంతవరకూ. తనకుమాలిన ధర్మం ఉండకూడదోయ్, ఇదిగో ఈ వంద ఉంచు... నా దగ్గరా ఎక్కువ లేదు' ఇచ్చాడు కనకారావు.

మాట్లాడకుండా తీసుకున్నాడు సుబ్బారావు.

సుబ్బారావుకు ఏ దురలవాటూ లేదు. వల్లమాలిన బంధుప్రీతి, మొహమాటం తప్ప. నీ వల్ల ఈ పని కావాలోయ్ అంటే శక్తికి మించినదైనా కాదనలేడు. అలానే డబ్బు కూడా తన దగ్గర లేకపోయినా ఎవరి దగ్గరయినా బదులు తీసుకుని అయినా వాళ్లకిస్తాడు. ఇలా ఇచ్చిన వాటిలో నిజాయితీగా వెనక్కి వచ్చినవి చెప్పాలంటే తక్కువే. అవన్నీ చచ్చినట్లు తనే తీరుస్తున్నాడు. మరి తనకు బదులిచ్చినవాళ్లు ఊరుకోరుగా. అదీకాక, తనకు ఎగ్గొట్టడమూ చేతకాదు. పోనీకదా, ఇలా జరిగింది ఇక అలా చెయ్యకూడదు. జాగ్రత్తగా ఉండాలి అనుకోవడమే కానీ ఆచరణ శూన్యం.

'మంచివాడే కానీ అదోటైప్ మనిషి. వీడితో మనకెందుకులే...' అని అతని గురించి తెలిసినవాళ్లు ఒక్కొక్కళ్లుగా అతనికి అప్పులివ్వడం మానేశారు.

ఋణభారం ఎక్కువై సుబ్బారావు కృంగిపోవడం మొదలెట్టాడు. బయటకు వెళ్లాలంటే భయం... అలా అని తీర్చకుండా మొండికెయ్యలేడు. మనిషిలో హుషారు తగ్గి బాగా డల్ అయ్యాడు.

ఆలోచనలతో సతమతమైపోతూ పేపరు

తిరగేస్తున్న సుబ్బారావుని ఓ వార్త ఆకర్షించింది.

'ఆర్థిక కారణాలు, ఇబ్బందుల దృష్ట్యా తన భార్య, ముగ్గురు పిల్లలను చంపి తాను ఆత్మహత్య చేసుకున్న వైనం. ఫలానా వ్యక్తి ఫలానా చోట...' అంటూ వివరంగా ఇచ్చారు పేపరులో.

'మంచిపని చేశాడు. ఏ బాధలూ లేకుండా హాయిగా తన వాళ్లను చంపి, తనూ చచ్చాడు. కానీ చావడానికెంత ధైర్యం కావాలి. ఎంత తెగింపు, తెగువ కావాలి' అనుకున్నాడు సుబ్బారావు.

'మంచైనా, చెడైనా మనిషి మనసులో ఆలోచన రేకెత్తాలేగానీ అది పెరిగి పెద్దదవడం ఎంతసేపు.

తాను చచ్చిపోతే... అప్పుడీ అప్పుల సమస్య, వేదన ఉండవుగా. కానీ, తను చచ్చిపోతే పాపం లక్ష్మి. లక్ష్మి, పిల్లలూ అనాథలయిపోరూ...' ఆలోచనలో పడ్డాడు సుబ్బారావు.

'తన సంపాదనతో తానూ, భార్యాపిల్లలూ ఎలాగోలా బతకచ్చు కానీ- అవివేకంగా తాను చేసిన అప్పుల మాటేమిటీ. అవెలా తీర్చగలడు. వాటిని జీవితాంతం తీరుస్తూ... తన పిల్లల్నెలా పెంచి పెద్దచేసి, చదువు సంధ్యలు చెప్పించగలడు.

ఛ... చాలీచాలని బతుకు గడపటం కంటే హాయిగా చావడమే మేలు. అయితే తను మాత్రం చచ్చి సుఖపడితే, మరి తన భార్యాబిడ్డల గతో...! ఎందరికో మేలు చేసిన తను తనని నమ్ముకున్న భార్యాబిడ్డలకు మాత్రం అన్యాయం ఎలా చెయ్యగలడు... అలా అని వాళ్లని సుఖపెట్టి పోషించలేడు. అందుకే హాయిగా వాళ్లతో కలసి చచ్చిపోవడమే బెటర్!'

దేనికోదానికి తనతో లడాయి వేసుకునే భర్త ఈ మధ్య మౌనంగా ఉండటం... ఏదో ఆలోచనల్లో సతమతమవడం గమనించిన లక్ష్మికి అది చాలా అసహజంగా... జరగరానిదేదో జరిగేలా అనిపించింది. భర్త కదలికలను జాగ్రత్తగా గమనించడం మొదలుపెట్టింది.

భర్త అంత దీక్షగా ఏం చదువుతున్నాడా పేపర్లో అని తనూ తొంగిచూసిన లక్ష్మికి- 'భార్యనూ, ఇద్దరు కూతుళ్లనీ కరెంట్ షాక్‌తో చంపి, తనూ ఆత్మహత్య చేసుకున్న వైనం... ఆర్థిక ఇబ్బందులే ఇందుకు కారణం...'

'ఏమిటో ఎక్కడ చూసినా చావులే... వెధవ వార్తలు... రాయడానికింకేం దొరకవులా వుంది వీళ్లకు...' అనుకుంటూ వెళ్లబోయిన లక్ష్మికి సడెన్‌గా మనసులో ఏదో మెదిలింది.

'అవును! ఈమధ్య ఈయన అదోలా వుంటున్నాడు. తనతో, పిల్లలతో సరిగా మాట్లాడటం లేదు కూడా... పైగా ఆ మధ్య పేపర్‌లో ఇలాంటి వార్తే ఏదో చదివి... ఆహాఁ ఎంత ధైర్యం! చావుని సమస్యలకు పరిష్కారంగా తీసుకోవాలంటే చచ్చేంత ధైర్యం, తెగింపు కావాలి... అంటూ ఏదేదో మాట్లాడాడు. కొంపదీసి, ఈయనకలాంటి బుద్ధేం పుట్టలేదు కదా!' గుండె గుభేల్మంది లక్ష్మికి.

'ఎలా అయినా ఈయన మనసులో ఏముందో బయటకు లాగాలి. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనగానీ కలిగిందా... అది మనిషిని నిలువునా మింగేస్తుంది. ఏదో ఒక వీక్ మూమెంట్‌లో అది జరిగిపోయే ఛాన్స్ వుంది. భయపడుతూ కూర్చుంటే కాదు, ఎలాగో అలా ఈయనను డైవర్ట్ చెయ్యాలి. అది తప్పుడు ఆలోచన అని చెప్పకనే తెలియజెప్పాలి. అంతవరకూ అనుక్షణం ఈయనను జాగ్రత్తగా చూసుకోవాలి' అనుకుంది లక్ష్మి.

లక్ష్మి సహజంగా తెలివైనది, ధైర్యస్థురాలు. అందుకే... అరచి, ఏడిచి అల్లరి పడకుండా, పెట్టకుండా అనుక్షణం మెలకువతో సుబ్బారావుని వాచ్ చెయ్యడం మొదలుపెట్టింది.

చంపడం... చావడం... గురించి ఆలోచించి, ఆలోచించి సుబ్బారావు ఒక నిర్ణయానికి వచ్చాడు.

'తను తప్పు చేశాడు. ఒళ్లుపై తెలియకుండా మెప్పు మెహర్బానీల కోసమో, పక్కవాడిని ఆదరించి సాయం చెయ్యాలనే ఆశయంతోటో తను చేశాడు. దానికి శిక్ష తనకి మాత్రమే పడాలి. పాపం! అన్నెం పున్నెం ఎరుగని తన వాళ్లని బలితీసుకునే హక్కు తనకెవరిచ్చారు? తను అంతటి కసాయి కాలేదు! లక్ష్మి తెలివైనది. తను పోతే కంపాసినేట్ గ్రౌండ్స్‌లో తన ఉద్యోగం లక్ష్మికిస్తారు. లక్ష్మి, పిల్లలూ హాయిగా బతకొచ్చు.

తను చేసిన అప్పులకూ, లక్ష్మికీ ఏ సంబంధం ఉండదు.

ఎస్... తప్పు నేను చేశాను. శిక్ష నాకొక్కడికే పడటమే న్యాయం! ఆలోచించీ, ఆలోచించీ ఆత్మహత్య చేసుకోవాలనే అద్భుతమైన నిర్ణయానికొచ్చాడు సుబ్బారావు. అమ్మయ్య! ఇప్పుడు హాయిగా ఉంది. సమస్యా పరిష్కారం అయిపోయింది కనుక నాలుగు రోజులు హాయిగా, ఆనందంగా గడిపేసి, అప్పుడు చచ్చి... బతికిపోతాను...' అనుకున్నాక సుబ్బారావుకి ఎక్కడలేని ఆనందం, ఉత్సాహం కలిగాయి.

'ఈ నాలుగు రోజులూ పిల్లలతో, లక్ష్మితో హాయిగా గడపాలి' అనుకున్నాక బోలెడంత ఉత్సాహం వచ్చింది సుబ్బారావుకి. అనుకున్నట్లే నాలుగు రోజులూ గడిచిపోయాయి.

'భర్త మామూలు మనిషయ్యాడు... దేవుడి దయవల్ల' అని లక్ష్మి ఆనందించింది.

నాలుగు రోజుల తర్వాత సుబ్బారావుకి అసలు సమస్య మళ్లీ ఎదురైంది.

'చావడానికయితే నిశ్చయించుకున్నాను కానీ... ఎలా చావడం? ఉరేసుకుంటే... అయ్యబాబోయ్!' ఆ మాటనుకుంటేనే ఊపిరాడక గిలగిలలాడిపోయాడు సుబ్బారావు. 'సుఖంగా బతకలేకపోయాను. కనీసం చావడమైనా కాస్త సుఖంగా ఛస్తాను' అనుకుని 'ఉరి' లిస్టులోంచి తీసేశాడు సుబ్బారావు.

'పోనీ సినిమాల్లో చూపించినట్లు పెట్రోల్లో, కిరసనాయిల్లో పోసేసుకుని అంటించుకుంటే...' ఆ రోజు వేడినీళ్లు స్టవ్‌మీంచి దించుకుంటూ అనుకున్నాడు సుబ్బారావు. ఆ ఆలోచనల్లో చూసుకోకుండా వేణ్ణీల్లు కాసిని కాలిమీద ఒంపేసుకున్న సుబ్బారావుకి ఓ విషయం అర్థమయింది. 'అమ్మో! కాసిని వేడి నీళ్లు పడితేనే బొబ్బలెత్తి చచ్చేలా మంటపుడుతోందే! మరి మొత్తం శరీరాన్ని కాల్చుకుని చచ్చిపోవడమా... అయ్యబాబోయ్! అంతకంటే ఎలాగోలా బతికి చావడమే బెటర్!' అనుకుంటూ అది కూడా లిస్టులోంచి కొట్టేశాడు.

'ఇకపోతే రైలు కింద తలపెడితే? అమ్మో! మొన్నటికి మొన్న గోడకి మేకు కొడుతూ వేలు చితక్కొట్టుకుంటేనే ప్రాణం జిల్లార్చుకుపోయింది. అలాంటిది చూస్తూ చూస్తూ రైలుకింద తల పెట్టడమే! అంతకంటే నరకం ఇంకొకటి లేదు. సుఖంగా బతకలేక కదా తను చావాలనుకున్నది. మరి అలాంటప్పుడు నరకయాతన పడుతూ చావలేక చావలేక చావడం ఏమిటీ? డామిట్! ఛస్తే హాయిగా, సుఖంగా చావాలి...' అదీ కొట్టేశాడు లిస్టులోంచి.

'పోనీ... పైనుంచి దూకితే, చావడం మాట అటుంచి ఏ కాలో చెయ్యో విరిగి బతికి కూర్చుంటే అదింకా డేంజర్!

పోనీ... నీళ్లలో దూకి చచ్చిపోతే? ఏదో కాసేపు ఉక్కిరిబిక్కిరయినా ఇదే కాస్త బెటరేమో!'

'ఏమిటండీ? ఉన్నట్లుండి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు! ఈ వేళ సరదాగా టాంక్‌బండ్ మీద కెడదాం అన్నారుగా పిల్లలను తీసుకుని' అడిగింది లక్ష్మి.

'ఆc ఆc వెడదాం... వెడదాం...' అన్నాడు ఆలోచనల్లోంచి తేరుకుంటూ.

'పిచ్చి లక్ష్మీ! నాకు ఓ చక్కని పరిష్కారం దొరికింది. మీతో హాయిగా గడిపి, మిమ్మల్ని కళ్లనిండా చూసుకుంటూ అక్కడే చచ్చిపోతా...'

'ఏమిటండీ! మళ్లీ మీ ఆలోచనా, మీరూనూ...' కుదుపుతూ అంది లక్ష్మి.

'ఆc ఏం లేదు... ఏం లేదు... త్వరగా పిల్లలను రెడీ చేసి, నువ్వు రెడీ అవు... అన్నట్లు నీకు నేను కొన్న ఏకైక పట్టుచీర... నీలం రంగుది కదూ... అది కట్టుకో... అది నీకు చాలా బాగుంటుంది' అన్నాడు ఆమెను అదోలా చూస్తూ.

'ఏమిటీ? టాంక్‌బండ్ మీద షికారుకెడుతూ పట్టుచీర కట్టుకోవాలా? మీకేమయినా పిచ్చెక్కిందా!' కసురుకుంది లక్ష్మి.

'ప్లీజ్... లక్ష్మీ! నాకు నిన్ను ఆ చీరలో చూడాలనుంది ఓసారి అన్నాడు. ఇదే కదా నాకు ఆఖరి చూపు' అని మనసులో అనుకుంటూ.

'అది కాదండీ... ఏ పెళ్లికో, పేరంటానికో కట్టుకెళ్లాల్సిన పట్టుచీర ఇప్పుడు కట్టుకోవడం ఏమిటండీ' అంది అయోమయంగా.

'ప్లీజ్ లక్ష్మీ! ఈ ఒక్కసారికీ నా మాట కాదనకు. వెళ్లు! వెళ్లి త్వరగా రెడీ అవండి' గంభీరంగా అన్నాడు సుబ్బారావు.

'ఏమిటో... ఈయనా, ఈయన పిచ్చిగోల! సరే! ఏదో ఒకటిలే ఇప్పుడిప్పుడే కాస్త మనుషుల్లో పడుతున్నారు. కట్టుకుంటే పోయేదేముంది?' అనుకుంటూ వెళ్లి రెడీ అయి వచ్చింది లక్ష్మి.

'ఎలాగూ... ఇది ఆఖరి ప్రయాణమే కదా! కుటుంబంతో కలసి హాయిగా, ఆనందంగా ఆటోలో వెడదాం..' అనుకుని ఆటో మాట్లాడాడు- లక్ష్మి లబోదిబోమంటున్నా వినకుండా.

వేసవికాలం సాయంత్రమేమో... ఎండ తగ్గి చల్లటి గాలి ప్రారంభించింది. పిల్లలిద్దరూ హాయిగా ఆడుకుంటున్నారు. సుబ్బారావు, లక్ష్మి అక్కడున్న సిమెంట్ బెంచీల మీద కూర్చున్నారు.

అప్పటిదాకా హుషారుగా వున్న భర్త సడన్‌గా మళ్లీ మూడీగా, డల్‌గా అక్కడున్న విగ్రహాలను చూస్తూ కూర్చోవడం చూసి లక్ష్మి- 'ఏం జరిగి వుంటుందా?' అన్న ఆలోచనలో పడింది. ఇంతలో దూరంగా హుస్సేన్‌సాగర్ ఒడ్డున బోలెడుమంది గోలగోలగా గుమిగూడటం చూసిన వీళ్లిద్దరూ టాంక్‌బండ్ పైనే అటువైపు నడిచారు.

కనుచూపు దూరంలో కనబడ్డ దృశ్యం వాళ్లని అచేతనుల్ని చేసింది. పోలీసులు ఈతగాళ్ల సాయంతో వెలికితీసిన ఓ మృతదేహం... బాగా ఉబ్బిపోయి చూడటానికి భయంకరంగా... అంతా గోల గోల... గందరగోళం...

'అమ్మో! ఈ చావు నాకొద్దు!' ఒళ్లు జలదరిస్తుండగా నిలువెల్లా కంపించిపోతూ సుబ్బారావు పెట్టిన కేకకి అటుగా వున్న ఒకళ్లిద్దరు ఇటు తిరిగి చూశారు. ఏమిటా కేక అన్నట్లుగా...

'ఏమండీ!' అంటూ గట్టిగా సుబ్బారావు చేతిని పట్టుకున్న లక్ష్మికి వణికిపోతున్న సుబ్బారావు స్పర్శ- విషయం చెప్పకనే చెప్పింది.

'ఏమండీ! నన్నూ, పిల్లల్నీ అన్యాయం చేసి పోదామనుకున్నారు కదూ!' అంటూ కళ్లనీళ్లతో అడిగిన లక్ష్మి ప్రశ్న సూటిగా సుబ్బారావుని తాకింది.

'లేదు లేదు... లక్ష్మీ! నేను చచ్చినా చావను. ఎలాగో అలా బతుకుతాను. కష్టాలు అయినా బతుకుతాను. అంతేకానీ, ఇంత భయంకరమైన, నరకప్రాయమైన చావుని మాత్రం ఇంక ఆహ్వానించను. నీతోడు!' అంటూ దగ్గరికి తీసుకున్నాడు లక్ష్మిని.

'లేదండీ! ఎవరూ కూడా కష్టాల బతకకూడదు. అసలు అలాంటి అవసరం, అగత్యం ఎవరికీ కలగకూడదు. ఏ సమస్యకీ చావు పరిష్కారం కానేకాదు. సృష్టిలో అన్నిటికంటే అందమైనది, ఉత్తమమైనది మానవ జన్మ. అలాంటి జన్మ మనకిచ్చిన దేవుడు తప్పకుండా ప్రతీ వాళ్లకీ బతికే శక్తినిస్తాడు.

సమస్యలనేవి అందరికీ ఉంటాయి. దానికి చావే పరిష్కారం అయితే, అసలు భూమ్మీద మానవజాతి మొత్తం హరించుకుపోయినట్లే. చిన్నాచితకా సమస్య లేని మనిషే ఉండదు. ఆత్మస్థయిర్యంతో, సంయమనంతో సమస్యలని అధిగమించాలి. కానీ పిరికివాడిలా పారిపోవాలని చావును ఆశ్రయించకూడదు. చావుకిన్ని చావులుండవు.

నిజమే! తెలిసో, తెలియకో మనం ఆర్థికంగా కష్టాల ఊబిలో కూరుకుపోయాం. దానిని ఎలా అధిగమించాలో ఆలోచిద్దాం. అటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూసుకుందాం. అంతేకానీ, ఓడిపోయి ఇలా చావునాశ్రయించాలనే ఆలోచన ఇంకెప్పుడూ చెయ్యకండి. బతుకు బతకడం కోసమే కానీ ఇలా అర్థాంతరంగా చావడం కోసం కాదు. అది మనిషిగా మానసిక వైకల్యానికి, వైఫల్యానికి నిదర్శనం. ఆర్థికంగా చితికిపోయామనో... ప్రేమలో మోసపోయామనో... పరీక్షల్లో ఫెయిలయ్యామనో... ఇలా ఏదో కారణం చావుకు కారణం కాకూడదు. దేవుడిచ్చిన జన్మ వరంలా భావించి హాయిగా బతకాలి. ఇంకెప్పుడూ ఇలాంటి పిచ్చి ఆలోచనలు చెయ్యనని...'

'అమ్మో! మళ్లీ ఇలాంటి ఆలోచనా... చావంటే చచ్చే చావని అర్థమయ్యాక కూడానా...' గాభరాగా అంటున్న సుబ్బారావుని చూస్తే నవ్వాగలేదు లక్ష్మికి. ○